## అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న సీడీపీవో నిర్మలాజ్యోతి

చంద్రుగొండ, అక్టోబర్ 30: అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని సీడీపీవో నిర్మజ్యోతి అన్నారు. సోమవారం చంద్రుగొండలో జరిగిన సెక్టార్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పక్కగా మెయింటెన్ చేయాలని, పౌష్టికాహారం అందజేయడంలో పారదర్శకత పాటించాలన్నారు. గర్భిణులు, తల్లులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడి సెంటర్లలో ఆకుకూరలు పెంచాలని, వాటితో తల్లులకు పౌష్టికాహారం అందించాలన్నారు. నేడు అంగన్‌వాడీ కేంద్రాలు పౌష్టికాహర కేంద్రాలుగా మారాయన్నారు.సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శోభారాణి, అనిత, భారతి, భూషమ్మ, పాల్గొన్నారు.

## శివాలయంలో పూజలు

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 30: పట్టణంలోని కోనేరు పురాతన శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామికి అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణ చేస్తూ ధూపదీప నైవేద్యాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగు నింపేలా మ్యానిఫెస్టో

### ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


గులాబీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 30: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ నుంచి 15 కుటుంబాలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని బుగ్గ గ్రామపంచాయతీకి చెందిన 15 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రేగా గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టో పేదల జీవితాల్లో వెలుగులు నింపే విధంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల వలె ప్రచారంలో దూసుకుపోవాలన్నారు. ఇంటింటికెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పినపాక నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి చైతన్యం చేయాలన్నారు. పినపాక నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ రికార్డు మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి రామకృష్ణ, ఉపసర్పంచ్ బండ్ల కృష్ణ, వేర్పుల సురేశ్, పద్దం మంగయ్య, దేవయ్య, రమేశ్, మడకం జోగయ్య, ఎట్టి సోమయ్య, మడివి నరేశ్, ఎట్టి గంగరాజు, మడివి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా దంపతులు

అశ్వారావుపేట, అక్టోబర్ 30: ఏపీలోని విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని సోమవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ఎమ్మెల్యే మెచ్చా, భార్య శ్యామల ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెజారిటీ సీట్లు సాధించి తిరిగి సీఎం కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా రెండో సారి గెలిచేలా ప్రజల తరుపున ఆశీర్వచనలు అందించాలని వేడుకున్నారు. ఆయన వెంట కుమారుడు మెచ్చా రాము, మొద్దులగూడెం సర్పంచ్ సున్నం రాము, నాయకులు దొడ్డా నాగేశ్వరరావు, బాల శ్రీను ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

### అశ్వారావుపేట రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు


మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ రాంబాబు

అశ్వారావుపేట, అక్టోబర్ 30: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని, విధులను అధికారులంతా సమన్వయంతో కలిసి ప్రశాంతంగా నిర్వహించాలని అశ్వారావుపేట రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో సోమవారం పీవోలు, ఏపీవోలకు ఎన్నికల నిర్వాహణపై రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఓటు వినియోగం, ఏ ఓటును ఎలా స్వీకరించాలని, ఇందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని వివరించారు. ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే మౌలిక సదుపాయాలు, ఓటర్లకు అధికారుల ఎలా సహకరించాలో తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతగా 259 మంది పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు. ఏఆర్‌వోలు కృష్ణ ప్రసాద్, ఎండీ ముజాహిద్, జీ పుల్లారావు, జగదీశ్వర్ ప్రసాద్, సాదియా సుల్తానా, మాస్టర్ ట్రైనీలు పీఎస్‌ఎస్‌వీ ప్రసాద్, వీ సత్యనారాయణ, జీ వెంకటేశ్వర్లు, నయాబ్ తహసీల్దార్లు పర్యవేక్షించారు.

## ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన రిటర్నింగ్ అధికారి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్

మణుగూరు టౌన్, అక్టోబర్ 30: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను పినపాక అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సోమవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావులతో కలిసి పరిశీలించారు. రాజకీయపార్టీల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ కోసం చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రకియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని రకాలుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## విద్యార్థులపై ఉపాధ్యాయుడి పైశాచికం


పాఠశాలలో విచారణ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

అశ్వారావుపేట, అక్టోబర్ 30: పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు కట్టుతప్పాడు. ఎక్కాలు చెప్పలేదన్న సాకుతో అభం శుభం తెలియని పిల్లల దుస్తులు విప్పించాడు. పైశాచికంగా వీడియోలను చిత్రీకరించాడు. బాధితులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో విషయం బయటకు వచ్చింది. ఈ ఘటన సోమవారం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వెలుగు చూసింది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలకు చెందిన మోహన్‌రావు అనే ఉపాధ్యాయుడు ఇటీవల ఎక్కాలు సరిగా అప్పజెప్పడం లేదని నలుగురు విద్యార్థుల యూనిఫాం విప్పించాడు. వీడియోలను మొబైల్‌లో చిత్రీకరించాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం బయటకు వచ్చింది. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడు మోహన్‌రావు విధులకు హాజరుకాకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. వారి నుంచి విచారించి వివరాలు నమోదు చేశారు. ఆందోళనకారుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం గ్రామస్తులు డీఈవో వెంకటేశ్వరచారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## వరి పొలాలు పరిశీలించిన అధికారులు


వరిపొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దమ్మపేట, అక్టోబర్ 30: మండలంలోని మందలపల్లి, మొద్దులగూడెం గ్రామాల్లో వానకాలం సీజన్‌లో సాగుచేసిన వరిపంటలో విత్తనాల్లో కల్తీ జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి ఏడీఏ జీ లాల్‌చంద్, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, శివకుమార్ సోమవారం వరిక్షేత్రాలను పరిశీలించారు. వరి విత్తనాల్లో కల్తీ వచ్చాయని నిర్ధారిస్తూ నివేదికను రెండు, మూడు రోజుల్లో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో వినోద్, రైతులు బుజ్జి, శ్రీనివాసరావు, బాల రవి, ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రూ.9.60 లక్షలు పట్టివేత

గుండాల, అక్టోబర్ 30: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోమవారం మండలంలోని యాపలగడ్డ గ్రామం వద్ద ఎస్సై కిన్నెర రాజశేఖర్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. తనిఖీలో భాగంగా గుండాలకు చెందిన వ్యాపారవెత్త వద్ద ద్విచక్రవాహణంపై తీసుకెళ్తున్న రూ.9.60 లక్షల నగదు ఉండడంతో పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును సీజ్ చేసి ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించామని తెలిపారు. అన్ని ఆధారాలు ఉంటే తిరిగి ఆ నగదు అప్పగిస్తామని తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా డబ్బు, మద్యం తరలించినా వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్లైయింగ్ స్కాడ్ వెంకటేశ్వర్లు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చండ్రుగొండ మండలంలో మహిళా ఓటర్లు అధికం

చంద్రుగొండ, అక్టోబర్ 30: మండలంలో మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 22,785 ఓటర్లుండగా అందులో మహిళలు11,532, పురుషులు 11,253 ఉన్నారు. మహిళ ఓటర్లు 279 మంది అధికంగా ఉన్నారు. పోలింగ్ బూత్ నెంబర్ 35 నుంచి 61 వరకు మండలంలో కేటాయించారు. మంగయ్యబంజర పోలింగ్ బూత్‌లో మొత్తం ఓటర్లు 527 మంది, అత్యధికంగా తిప్పనపల్లి బూత్ నెంబర్ 37లో 1167 మంది ఓటును వినియోగించుకోనున్నారు. అత్యధికంగా మహిళ ఓటర్లు తిప్పనపల్లి పోలింగ్ బూత్ నెంబర్ 38లో 613 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

# గొంతాలమ్మ అమ్మవారి పండుగ



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు, ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 30: ఊరి ఆడబిడ్డగా, గ్రామ దేవతగా కొలుచుకునే గొంతాలమ్మ అమ్మవారి పండుగను పట్టణంలోని దొంతికుంట కాలనీలో నెలరోజులు పాటు నిర్వహించుకున్నారు. అమ్మవారిని సోమవారం గ్రామం నుంచి మేళతాళాలతో సాగనంపి నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ నెలరోజులు క్రితం అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఉంచి పూజలు నిర్వహించారు. అమ్మవారిని సాగనంపే ముందురోజు ప్రతి ఇంటి ఆడబిడ్డను ఈ వేడుకలకు ఆహ్వానించి పూజలు చేసి సంబురాలు జరుపుకోవటం ఆనవాయితీ అన్నారు. మరుసటి రోజు అమ్మవారిని గ్రామస్తులంతా కలసి అమ్మవారిని వీధుల్లో ఊరేగింపుగా సాగనంపి సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

## రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించిన సీఐ

అశ్వారావుపేట, అక్టోబర్ 30: నవంబర్ 3వ తేదీ నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ చాంబర్‌కు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకునేందుకు సీఐ కరుణాకర్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 3వ తేదీ నుంచి జరిగే ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రారంభం కాబోతున్నందున ఎన్నికల నిబంధనల మేరకు కార్యాలయానికి వచ్చే అభ్యర్థులు, మద్ధతుదారులు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలతో పాటు కార్యాలయం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాల్సి ఉందని చెప్పారు.

## మండలంలో వైద్యశిబిరాలు

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 30: మండలంలోని కొత్తకన్నాయిగూడెం, కంట్లం, గోపన్నగూడెం గ్రామాల్లో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. గర్భిణులకు, చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేశారు. ప్రభుత్వ వైద్యశాల్లోనే ప్రసవాలు జరగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రాధాబాయి, స్వరూప, ఆశా కార్యకర్త సీత పాల్గొన్నారు.

## చెలికాని కుటుంబానికి జడ్పీటీసీ పరామర్శ

దమ్మపేట, అక్టోబర్ 30: మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన రైతుబంధు సమితి మండల కన్వీనర్ చెలికాని ప్రసాద్‌రావు కుమార్తె సూర్యకళ ఇటీవల మృతిచెందారు. సోమవారం ఆమె సంస్మరణకు హాజరైన జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు సూర్యకళ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ప్రసాదరావు, కుటుంబసభ్యులకు పరామర్శించారు.

## అన్నను హతమార్చిన తమ్ముడు

ములకలపల్లి, అక్టోబర్ 30: సొంత తమ్ముడు అన్నను హతమార్చిన ఘటన మండలంలోని మొగరాలగుప్పలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొగరాలగుప్ప గ్రామానికి చెందిన కీసరి రామారావు (32), కీసరి వెంకటేశ్ ఇద్దరూ అన్నదమ్ములు. అన్న రామారావు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి వచ్చి తల్లితో గొడవపడుతుండగా తమ్ముడు వెంకటేశ్ అడ్డువెళ్లాడు. ఈ క్రమంలో అన్నదమ్ములిద్దరి మధ్య ఘర్షణ జరగ్గా పొయ్యిలో ఉన్న కట్టెతో అన్న రామారావుపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై సాయికిషోర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.